ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం



29మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్

బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 10749మంది విద్యార్థులకు గానూ 29మంది గైర్హాజరైనట్లు డిఇఒ డిఎస్‌వి రమణ తెలిపారు. అలాగే 22 మంది విద్యార్థులకు స్క్రైబ్‌లకు అనుమతిలిచ్చినట్టు తెలిపారు. జిల్లా అంతటా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ దూషి నాగమణి తెలిపారు. ఈ పరీక్షకు 40 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఇద్దరు హాజరు కాలేదని ఆమె తెలిపారు.

టిడ్కో ఇళ్ల అప్పగింతెప్పుడో?



- బిల్లుల మంజూరులో జాప్యమే కారణమా ?
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మందకొడిగా పనులు

ప్రజాశక్తి - సాలూరు

టిడ్కో ఇళ్ల అప్పగించేదెప్పుడు జరుగుతాయో తెలియని అయోమయంలో లబ్ధిదారులు ఉన్నారు. ఈ ఏడాది ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని కొద్ది నెలల క్రితం చైర్మన్ జె.ప్రసన్నకుమార్ చెప్పారు. అంతకుముందు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొరను కొంతమంది లబ్ధిదారులు టిడ్కో గృహ ప్రవేశాలపై ప్రశ్నించారు. ఆయన వెంటనే టిడ్కో ఉన్నతాధికారుల తో మాట్లాడారు. చైర్మన్ జె.ప్రసన్నకుమార్ డిప్యూటీ సీఎం రాజన్నదొరని కలిసి టిడ్కో గహ నిర్మాణ పనుల గురించి వివరించారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. ఉగాది దాటిపోయింది. నిర్మాణ పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే మరో ఆరునెలలు వరకు ప్రవేశాలు జరిగే అవకాశాలు లేవు. నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడం, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ పిలవడం వంటి అంశాలు జాప్యానికి కారణమని తెలుస్తోంది. జగనన్న లేఅవుట్లకు ఇస్తున్న ప్రాధాన్యం టిట్కో ఇళ్లకు ఇవ్వడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

టిడిపి ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలోని 1248మంది లబ్ధిదారులకు సరిపోయేలా గృహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 300చదరపు అడుగులు విస్తీర్ణంలో ఉన్న సింగిల్ బెడ్ రూం ఇళ్లు 24బ్లాకులు నిర్మిస్తున్నారు. 365చదరపు అడుగులు వున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు రెండు బ్లాకుల నిర్మాణం జరుగుతోంది. విజయ్ నిర్మాణ్ కన్ స్ట్రక్షన్స్ , ఇంద్రజిత్ మెహతా కన్ స్ట్రక్షన్స్ కంపెనీలు ఈ గృహ నిర్మాణ పనులు చేపడుతున్నాయి. ఒక్కో బ్లాక్ లో 48 ఇళ్లు జి+ త్రీ పద్ధతిలో నిర్మాణం సాగుతోంది. రెండో విడత టిడ్కో గహ నిర్మాణం లో భాగంగా ఉమ్మడి జిల్లాలో సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి, నెల్లిమర్ల మున్సిపాలిటీల్లో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి.

మందకొడిగా పనులు

సింగిల్ బెడ్ రూం లకు సంబంధించిన 24 బ్లాకుల్లో ఇంతవరకు పది బ్లాకులు మాత్రమే నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. మిగిలిన 14 బ్లాకుల్లో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ఇంటర్నల్ రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పనులు ఎప్పటికి ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి. ఈ పనులకు సంబంధించి టెండర్లను పిలిచే దశంలో అధికారులు ఉన్నారు.

బిల్లుల మంజూరు లో జాప్యమే కారణమా

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో గహ నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల మంజూరులో జాప్యం వల్లనే నిర్మాణపనులు నత్తనడకన జరగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ కనబరుస్తున్న నేపథ్యం లో పేదలకు టిడ్కో గృహాల నిర్మాణం జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ రంగంలో పను లకు ఏళ్ల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ టిడిపి హయాంలో ప్రారంభమైన టిడ్కో గహాల నిర్మాణం పై ఆసక్తి చూపడం లేదు.

నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు

పార్వతీపురంటౌన్: మున్సిపాల్టీలో 768మంది టిడ్కో ఇళ్లు మంజూరవ్వగా, వీటిలో 684 పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగాయి. ఇంకా 84 గృహాలకు ఇంకా 84 ఇళ్ల గోడల నిర్మాణంజరుగుతుంది. ఈ ఏడాది ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల పనులు నత్తనడక సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు వాటర్ పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఇంకా టైల్స్, రంగులు వేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లేందుకు ప్రస్తుం గ్రావెల్ రోడ్డు వేశారు. ఈ రహదారులను సిసి, బిటి రోడ్లుగా నిర్మించాల్సి ఉంది. తాగునీటి సౌకర్యం కోసం రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం జరగాల్సి ఉంది.

జూన్ కల్లా అప్పగింత

ఈ ఏడాది జూన్ కల్లా టిడ్కో గృహాల ప్రవేశాలు జరుగుతాయి. 1050మందికి గృహ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలకు సంబంధించి పనులకు టెండర్లు పిలిచారు.

హెచ్.శంకరరావు, మున్సిపల్ కమిషనర్, సాలూరు

ఆగస్టు నాటికి లబ్ధిదారులకు అందజేస్తాం

టిడ్కో ఇళ్ల పెండింగ్ పనులను ఈనెలలో ప్రారంభిస్తున్నాం. పనులు పూర్తి చేసి ఆగస్టు నాటికి లబ్ధిదారులకు అందజేస్తాం.

జె.రామప్పలనాయుడు, కమిషనర్, పార్వతీపురం.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, పక్కన కలెక్టర్ నిశాంత్‌కుమార్

సామాన్యుడి చెంతకు వైద్యం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

సామాన్యుడికి చెంతకు వైద్య సేవలందించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ప్రారంభించినట్లు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. కావున దీన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గిరిజనులు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందలేని పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టరు విధానం అత్యంత ఉపయోగకరమన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు మంజూరయ్యాయని, అందుతో పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం జరుగుతుందని ఆయన వివరించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మండలంలోని మోసూరులో ఉప ముఖ్యమంత్రి కలెక్టరు నిశాంత్ కుమార్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 21న పైలెట్ ప్రోజెక్టుగా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందన్నారు. రక్తపోటు, మధుమెహం రోగులకు చికిత్స, మందులు అందించబడతాయని, శస్త్రచికిత్స చేయించుకున్న పేషంట్ల ఇంటి వద్దనే కలిసి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారన్నారు. ప్రతి వైద్యాధికారికి మొబైల్ ఫోన్ అందించబడుతుందని, ఇది అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వైద్యుడిడ్ని పిలవడానికి వీలుగా ప్రజలకు అందించబడుతుందని పేర్కొన్నారు. డాక్టర్, ప్రజల మధ్య మంచి సంబంధాలు ఏర్పడుతుందని, ప్రజలకు వైద్యసేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా తోడ్పడుతుందని తెలిపారు. ఒక్కో వైద్యుడు గరిష్టంగా 67 గ్రామాలకు మ్యాప్ చేయబడి, ప్రతి నెలా అదే గ్రామ ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 67రకాల మందులు, 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందిస్తారని తెలిపారు. ప్రతి గ్రామ ఆరోగ్య క్లినిక్‌ల్లో జిల్లా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గల వైద్యులు, నిపుణుల నుంచి సంప్రదింపులు పొందడానికి వీడియో సౌకర్యంతో టెలీకన్సల్టేషన్ అందించబడుతుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆరోగ్య కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పదహేను 104 వాహనాలతో దాదాపు 195 గ్రామ ఆరోగ్య క్లినిక్‌లను కవర్ చేస్తూ ప్రారంభించిన ఈ సేవలను 19 వాహనాలతో 440 పైగా గ్రామ ఆరోగ్య కేంద్రాలకు విస్తరిస్తున్నట్టు తెలిపారు. మిలిగిన 104 వాహనాలు నెలలో 26 రోజుల పాటు తిరుగుతూ మారుమూల ప్రాంతాలకు ఆరోగ్య సేవలందించనున్నాని తెలిపారు. కుటుంబ వైద్యుడు, అతని బృందం గ్రామంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. జిల్లాలో మార్చి 2023 నాటికి 1,01,806 మంది తమ సొంత గ్రామాల్లో కుటుంబ వైద్యుల కార్యక్రమంలో సేవలను పొందారని తెలిపారు. అత్యవసర సేవల్లో 108 అంబులెన్సులు 17 వాహనాలు సేవలందిస్తున్నాయని జిల్లా కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి. జగన్నాథ రావు, ప్రోగ్రాం అధికారి డా.వినోద్, స్థానిక వైద్య అధికారి, మండల తహశీల్దారు, గ్రామ సర్పంచ్ జి.చంటి, వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, నాయకులు వీరమనాయుడు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రీ సర్వే పనుల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రీ సర్వే పనులు సకాలంలో పూర్తిచేసేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సకాలంలో పూర్తిచేసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశామని, పనుల ప్రగతిని ప్రతిరోజు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రీ సర్వే, జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ, విద్య, వ్యయసాయం, మత్స్యశాఖ, వై.ఎస్.ఆర్. చేయూత, జగనన్న పాలవెల్లువ, హౌసింగు, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్., జగనన్న స్వచ్ఛ సంకల్పం, జగనన్న శాస్వత భూహక్కు తదితర పథకాల అమలును సమీక్షించారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తిచేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కష్ణాజి, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఓ.ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక అధికారి ఏ. ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

టేకు, వెదురు విక్రయం

ప్రజాశక్తి- కలెక్టరేట్

టేకు, వెదురు విక్రయానికి చర్యలు చేపట్టామని జిల్లా అటవీశాఖ అధికారి జి.ఎ.పి.ప్రసూన తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 142 లాట్‌ల టేక్ కలప, ఒక వెదురు లాట్ అమ్మకానికి ఉన్నాయని ఆమె అన్నారు. ఆసక్తి కలవారు ఏప్రిల్ 10న సాలూరు ప్రభుత్వ వెదురు అమ్మకం డిపో వద్దకు రావచ్చని ఆమె కోరారు. 948 దుంగలు (లాగ్స్) గల 142 టేక్ లాట్‌లో రూ.29,02,232 విలువ గల 55.54 క్యూబిక్ మీటర్లు, వెదురు లాట్‌లో రూ.71,840 విలువ చేసే 4 వేలకర్రలు ఉన్నాయని ఆమె వివరించారు.

10న చలో ఎంఇఒ ఆఫీస్ : యుటిఎఫ్

ప్రజాశక్తి -కలెక్టరేట్

పార్వతిపురం ఎంఇఒ వైఖరికి నిరసనగా ఈనెల 10న యుటిఎఫ్ ఆధ్వర్యంలో చలో ఎంఇఒ ఆఫీసు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన రావు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎంఇఒ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని, అలాగే కక్ష సాధింపులు చేపడుతూ, నచ్చని వారికి సిఎల్ మంజూరు చేయడం లేదన్నారు. మహిళా ఉపాధ్యా యులపై దుర్భాషలాడుతూ ఏ పనికైనా ఆఫీసుకు రావాలని చెబుతున్నారని అన్నారు. ఉపాధ్యాయిని సిహెచ్.కమలకు సెలవు మంజూరు చేయకుండా జాప్యం చేస్తే, డిఇఒ జోక్యంతో సెలువు మంజూరు చేశారని తెలిపారు. ఈలోగా కమల మామ చనిపో యారని అన్నారు. కావున ఎంఇఒపై చర్యలు తీసుకోవా లని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలపారు.

8న గిరిజన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

బోయ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మార్చి 24న అసెంబ్లీలో ముఖ్యమంత్రి తీర్మాన ప్రవేశపెట్టడానికి వ్యతిరేకిస్తూ ఈనెల 8న గిరిజన ఎమ్మెల్యేకు వినతిని అందజేయనున్నట్టు గిరిజన జెఎసి నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీర్మాణానికి వ్యతిరేకంగా ఇప్పటికే ఈ మార్చి 31న తలపెట్టిన మన్యం బంద్ విజయవంతమైందని, అదే సందర్భంగా ఈనెల8న గిరిజన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు.

రోడ్లు, భవన నిర్మాణ పనుల పరిశీలన



ఆర్‌కె బట్టివలస వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొత్తగా నిర్మితమవుతున్న క్లాస్ రూమ్‌లు, రోడ్లను పార్వతీపురం ఐటిడిఎ పిఒ అధికారి సి. విష్ణు చరణ్ గురువారం తనిఖీ చేశారు. మండలం లోని చినమరికి నుంచి ఆర్‌కె బట్టివలస గ్రామాల మధ్య జరుగుతున్న బిటి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. నాబార్డ్ నిధులతో నిర్మాణమవుతున్న బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను తనిఖీ చేశామన్నారు. పార్వతీపురంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కొత్తగా నిర్మితమవుతున్న భోజన షెడ్ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. తనిఖీ చేసిన పనులను వెంటనే పూర్తి చేసే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీర్ జె.శాంతీశ్వరరావు, డిఇ, ఎఇ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

సిటియులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి గాను నిర్వహిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని, ఈనెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సిటియు విసి ప్రొఫెసర్ కట్టమణి తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, మాస్టర్ అఫ్ సోషల్ వర్క్, మాస్టర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ అఫ్ ట్రైబల్ స్టడీస్, మాస్టర్ అఫ్ ఇంగ్లీష్, మాస్టర్ అఫ్ సోషియాలజీ, మాస్టర్ అఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లలో అడ్మిషన్ కోసం నిర్వహించే అర్హతపరీక్ష (సియుఇటి)ను జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోందని తెలిపారు. దీనికి సంభందించిన నోటిఫికేషన్ ఇప్పటికే ఎన్‌టిఎ వెబ్‌సైట్‌లో వెల్లడైందని తెలిపారు. అత్యంత తక్కువ ఫీజులతో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ కట్టిమని తెలిపారు.

నేవీ ఉద్యోగి మృతితో పర్లలో విషాదం

ప్రజాశక్తి-గరివిడి

పారాచ్యూట్ డ్రైవింగ్ శిక్షణలో మృతి చెందిన నేవీ ఉద్యోగి చందక గోవింద్ (30) మృతితో ఆయన స్వగ్రామం చీపురుపల్లి మండలం పర్ల గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. విశాఖలోని నేవీలో 2012 నుంచి ఉద్యోగం చేస్తున్న గోవింద్ మెరైన్ కమాండోగా విధులు నిర్వహిస్తున్నాడు.

పశ్చిమ బెంగాల్ లోనీ బుద్వాల్ జిల్లాలో పారా ట్రూపార్స్ టీంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం శిక్షణలో భాగంగా పారాచ్యూట్‌లో ఎయిర్‌క్రాక్ నుంచి కిందకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా పారా చ్యూట్ తెరుచుకోలేదు. దీంతో వందల మీటర్ల ఎత్తునుంచి ఆయన కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్య నిపుణులు తెలిపారు. ఈ విషయాన్ని నేవీ ధికారులతో ద్వారా తెలుసు కున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీ రయ్యారు. స్వగ్రామం పర్లలో తీవ్ర విషాదం అలము కుంది. గోవింద్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందాడు. తల్లి లక్ష్మి, సోద రుడు ఈశ్వరరావు, సోదరి గౌరీ ఉన్నారు. కుటుంబా నికి ఆధారమైన గోవింద్ చని పోవడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరయ్యారు. ఎప్పుడూ దేశ సేవకే అంకితమయ్యాడని, చివరకు ఆ వృత్తిలోనే ప్రాణాలు విడిచాడని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.



హమాలీలతో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో హమాలీల సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరా శాఖ నేతృత్వంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుం దని పేర్కొన్నారు. హమాలీల హక్కులను కాపాడేందుకు సహకరిస్తామని, అదే సమయంలో బాధ్యతగా పనులు నిర్వహిం చాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో పరిష్కారంకాని అంశాలుంటే రాష్ట్ర స్థాయి అధికార్ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద మూమెంట్ ఇన్ టైంలో కంప్లీట్ చేసి సకాలంలో ఎఫ్‌పి షాప్‌ల ద్వారా ఎండియులకు సరఫరా చేయాలన్నారు. గోడౌన్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను వారం రోజుల్లో పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర స రఫరా మేనేజర్ ఎండి నాయక్, జిల్లా పౌర సరఫరా అధికారి కెఎల్ఎన్ మూర్తి, హమాలీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అర్హత గల ఏ ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదన్న మాట రాకూడదని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మండల సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 నుంచి జగనన్నతో చెప్పుకుందాం కార్యక్రమంలో మన ప్రాంతం నుంచి ఎవరైనా తమకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపితే వెంటనే వారి సమస్యపై స్పందించే సమాచారం మీ వద్ద సిద్ధంగా ఉండాలని అందుకు మీరంతా కూడా ప్రజల సమగ్ర సమాచారం మీ వద్ద సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలానే అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు తప్పక అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బి.రమేష్, ఎంపిటిసి సభ్యులు బి.రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, ఎంపిడిఒ విజయలక్ష్మి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



రామారావు పార్థివదేహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణానికి చెందిన ఎపి ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి జివి కిషోర్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు గంట రామారావు గురువారం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతదేహాన్ని గురువారం స్వగృహానికి తీసుకురాగా, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి చిరంజీవులు పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడిగా రామారావు అందించిన సేవలు చిరస్మరణీయమని, విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదని ఆ సంఘం నాయకులు మంచిపల్లి శ్రీరాములు తదితరులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహాన్ని జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు, వైద్య సిబ్బంది దర్శించుకున్నారు.



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

మే 15 నాటికి సర్వే రాళ్లు ఏర్పాటు : ఆర్‌డిఒ

మక్కువ : మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో మే 15 నాటికల్లా సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో సర్వే రాళ్ళ ఏర్పాటు, ఎంత మేరకు పనులు జరిగాయన్న అంశంపై గురువారం ఎ.వెంకట్ పురంలో ఆర్‌డిఒ తనిఖీ చేశారు. రీ సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో తక్షణమే హద్దులకు సంబంధించిన రాళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్, సూర్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్నడిఎల్‌పిఒ గోపాలకృష్ణ

సచివాలయాలను సందర్శించిన డిఎల్‌పిఒ

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీలో గల కురుపాం 1, కురుపాం 2 సచివాలయాలను డిఎల్‌పిఒ గోపాలకృష్ణ గురువారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో గల రికార్డులను పరిశీలించి అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సచివాలయాలకు అందిస్తున్న సేవలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదని ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా సచివాలయ సిబ్బంది పని చేసే ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ పి.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ నవ్య

పరీక్షా కేంద్రం పరిశీలన

సీతంపేట : సీతంపేట బాలుర గురుకుల పాఠశాల, హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలల్లో గల పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ఐటిడిఎ పిఒ బి.నవ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎం, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒ తనిఖీ

మండలంలోని బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పాలకొండ డిప్యూటీ డిఇఒ స్యాడ్ విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పరీక్షలు సజీవుగా జరగాలన్నారు అనంతరం మళ్లి బాలుర గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పట్టా మంజూరుపై తహశీల్దార్‌కు వినతి

కురుపాం : ప్రభుత్వం హిజ్రాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఇచ్చిన స్థలానికి పట్టా మంజూరు చేయాలని హిజ్రాలు అసోసియేషన్ అధ్యక్షులు అడ్డాకుల గీతారాణి గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయనికి వెళ్లి తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం హిజ్రాలకు స్థలమైతే కేటాయించింది కానీ ఇంత వరకు పట్టా మంజూరు చేయలేదని తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ వారం రోజుల్లోగా హిజ్రాలకు కేటాయించిన స్థలంలో పట్టా మంజూరు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు.

చెరువును తలపిస్తున్న బస్టాండ్

జియమ్మవలస : స్థానిక బస్టాండ్ వద్ద నీరు చేరి చెరువును తలపిస్తుంది. దీంతో మండల కేంద్రానికి వచ్చే వాహనాలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దోమలు, ఈగలు చేరడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి బస్టాండ్ వద్ద నీరు నిల్వ లేకుండా చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సర్వే పరిశీలన

సీతానగరం : మండలంలోని పాపంవలస, ఇప్పలవలసలో ఇంటి పన్నుల వసూలు నిమిత్తం చేపడుతున్న స్వమిత్వా సర్వేను గురువారం ఇఒపిఆర్‌డి కెకె వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గల అన్ని స్థలాలు, ఇళ్ల హద్దులను ముందుగా తీసుకొని సర్వే చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో నిర్వహించి వాటి ద్వారా నివేదిక అందజేస్తామన్నారు. దీంతో ఆర్థిక వనరుల సేకరణ కూడా చేస్తామన్నారు. ఖాళీ స్థలాలు, ఇళ్ల హద్దుల్లో గ్రామ పెద్దల ద్వారా తెలుసుకొని సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు సిహెచ్ లక్ష్మణరావు, ఎం.గౌరునాయుడు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూళ్లు

సీతంపేట : పాలకొండ డివిజన్లో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయడం అభినందనీయమని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మండలంలోని హడ్డుబంగి సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేయాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసి మార్కెటింగ్ చేసుకుంటే పంచాయతీకి అధిక లాభాలు ఉంటాయన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపిడిఒ కె.సత్యం, కార్యదర్శి కోటేశ్వరరావు, సచివాల సిబ్బంది ఉన్నారు.



చెత్త తో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ సత్యనారాయణ

ఇంటి వద్దకే 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - సీతంపేట

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్యసేవలు అందనున్నాయని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. మండలంలోని పెదరామలో ఫ్యామిలీ డాక్టర్ విధానం వాహనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఇంటింటికీ వైద్యులు వెళ్లి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయ పార్వతి, దోనుబాయి పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్, స్థానిక సర్పంచ్ తిరుపతిరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కంబవలసలో వైస్ ఎంపిపి సంగిరెడ్డి శరత్ బాబు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో అమలు లోకి వచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, సర్పంచ్ అంబటి వెంకటలక్ష్మి, పిహెచ్‌ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది వాణి, శారద, 104 సిబ్బంది, ఆశా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి సిహెచ్‌సి వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనాలను కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్యాధికారులు ఎ.ప్రతిమ, ఆర్.రమ్య, పి.సునీత, పద్మావతి, జియమ్మవలస పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.తిరుపతిరావు, హెచ్‌ఇ లక్ష్మీకాంతం, హెచ్‌వి విజయ వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సీతానగరం, పెదంకలాం పిహెచ్‌సిలకు మంజూరైన వాహనాలను వైద్యాధికారి నిహారిక ప్రారంభించారు. ఈ వాహనంలో పరీక్షలు, మందులు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెరేజమ్మ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరులో 104 ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని సర్పంచ్ కె.రమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి వి.ఉమామహేశ్వరరావు,



కొమరాడ : 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



సీతంపేట : 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న పిఒ నవ్య

ఎంపిటిసిసభ్యులు ఎర్రపాత్రుని జయశ్రీ, సూపర్వైజర్లు పార్వతి, నవనీతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, టెక్నీషియన్ దినేష్, ఎఎన్‌ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల చెంతకే నిరంతరంగా వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం 104 వాహనాలను ప్రారంభించి అందులో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను, మందులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల ప్రోగ్రాం అధికారి భాస్కరరావు, బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎంఎం కె.తిరుమల ప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్, జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాధరావు, పూడి శంకరరావు, మండల పార్టీ అధ్యక్షులు బి.రమేష్, వైద్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డిఎస్‌సి వెంటనే ప్రకటించాలి

పార్వతీపురంటౌన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే డిఎస్సీ నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సున్నంశెట్టి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కలమట శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీచర్ పోస్టులకు డీఎస్సీ నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులను హై స్కూళ్లలో విలీనం చేయడం తగదన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు కొనసాగించాలని కోరారు. అలాగే నిరుద్యోగులకు వయోపరిమితిని ఒసి అభ్యర్థులకు 47ఏళ్ళు పెంచాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు 52 ఏళ్ల వరకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎంపిడిఒగా వెంకటరమణ



వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒగా వై.వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎ.ప్రభాకరరావు అనారోగ్య కారణంగా సెలవుపై ఉండడంతో మండల పరిషత్ ఎఒగా విధులు నిర్వహిస్తున్న వెంకట రమణకు ఎంపిడిఒగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'పై ప్రచారం

ప్రజాశక్తి -జియమ్మ వలస

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం చినమేరంగిలో గల తన నివాస గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో 98.5 శాతం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను వివరిస్తూ సంక్షేమ పథకాల సారథిగా జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలు ప్రభుత్వాన్ని విశ్వసిస్తే ప్రజల నుండి మద్దతును కోరుతామని తెలిపారు. నియోజకవర్గంలో 137 పంచాయితీల్లో 102 సచివాలయాల పరిధిలో 805 గ్రామాల్లో 1500 మంది వాలంటీర్లు 3వేల మంది గృహ సారథులు, 304 మంది సచివాలయ కన్వీనర్లతో పెద్ద ఎత్తున జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిఎంవలస, కురుపాం జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, జి.సుజాత, కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి, జియమ్మ వలస వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, ఎంఎస్‌ఎంఇ డైరెక్టర్ ఎంగౌరీ శంకరరావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు నియోజకవర్గంలోని ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

కురుపాం : జగననన్నే మా భవ్యష్యత్తు కార్యక్రమం కురుపాంలోని శివన్నపేటలో శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభిస్తారని ఎంపిపి శెట్టి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గహసారథలు మరియు సచివాలయ కన్వీనర్ల నియమించి వారి ఆధ్వర్యంలో 14 రోజుల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ పరిపాలన పై నేరుగా ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం జరుగుతుందని నియోజకవర్గంలో మొదటగా శివన్నపేటలో ప్రారంభిస్తున్న సందర్భంగా మండలం లో గల ఎంపీటీసీలు, సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పార్వతీపురం రూరల్ : నియోజకవర్గంలో శుక్రవారం నుండి ప్రారంభం కాబోయే జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ అన్న కార్యక్రమాల్ని కన్వీనర్లు గృహసారథులతో పాటు కార్యకర్తలు నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని14 రోజుల పాటు నిర్వహణ ద్వారా గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా ప్రజలకు చెబుతామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాథరావు, పూడి శంకరరావు, మండల కన్వీనర్ బొమ్మి రమేష్, నాయకులు బలగ నాగేశ్వరరావు, మడక విశ్వనాథం, గండి శంకరరావు, బంకూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వం ప్రవేశపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు అన్నారు. స్థానిక సచివాలయంలో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ప్రవేశపడుతున్న సంక్షేమ పథకాల వివరాల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమనంద్, గహ సారథి కొనిస సూర్యం ఉన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

పాలకొండ రూరల్: స్థానిక ఎ.ఎమ్.జి కన్వెన్షన్ హాల్లో పాలకొండ నియోజకవర్గ స్థాయి - జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించబడును. కార్యక్రమం ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - సాలూరు

తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వైసిపి నాయకులు బొన్నాడ శ్రీనివాసరావు భార్య పద్మకు డిప్యూటీ సిఎం రాజన్నదొర గురువారం రూ.3లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. కొద్దినెలల క్రితం బొన్నాడ శ్రీనివాసరావు తమిళనాడులో అరుణాచలం తీర్థయాత్రకు కారులో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలతో ఆయన మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు డిప్యూటీ సిఎం రాజన్నదొర రూ.3లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, గుల్లిపిల్లి నాగేశ్వరరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ ఉన్నారు.



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వారణాసి రైలును పార్వతీపురంలో ఆపాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విశాఖ నుంచి వారణాసికి నడిపే వేసవి ప్రత్యేక రైలును పార్వతీపురంలో ఆపాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ నాయకులు స్థానికరైల్వే స్టేషన్ మాస్టర్ మజ్జి రామకృష్ణను కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ నుండి వారణాసికి కొత్తగా వీక్లీ సమ్మర్ స్పెషల్ ట్రైన్‌ను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. అయితే దీని స్టాపు పార్వతీపురంలో లేకపోవడం బాధాకరమన్నారు. ఈ ట్రైను పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కావున పార్వతీపురంలో ఈ ట్రైన్ ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైల్వే స్టేషన్ మాస్టర్ ద్వారా రైల్వే డివిజనల్ మేనేజర్‌కు జనసేన నాయకులు వినతిని అందజేశారు. ట్రైన్ షెడ్యూల్‌కు సంబంధించి తమకున్న సమాచారం మేరకు విశాఖపట్నం, రాయగడ, రాయపూర్ తదితర స్టాపులు మాత్రమే వారణాసికి ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో స్టాపు లేదన్న విషయాన్ని తెలుసుకున్న ప్రజలు ఆవేదనకు గురవుతున్నారన్నారు. రైల్వే శాఖకు తగినంత ఆదాయాన్ని సమకూరుస్తున్న పార్వతీపురాన్ని విస్మరించడం సరికాదన్నారు. తక్షణమే విశాఖ వారణాసి సమ్మర్ స్పెషల్ ట్రైన్ పార్వతీపురంలో ఆగేలా చర్యలు తీసుకోవాలని స్టేషన్ మాస్టర్‌ను కోరారు. స్టేషన్ మాస్టర్ మాట్లాడుతూ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వినతిని అందజేసిన వారిలో వి.దాలి నాయుడు, రాజాన రాంబాబు, బంటు శిరీస్, జిల్లా కన్స్యూమర్స్ ఫారం పాసింజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వారణాసి శ్రీహరి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శివన్నపేటకు చెందిన సాలూరు రాధాకృష్ణ (52) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై హౌసింగ్ సిబ్బంది, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాధాకృష్ణ కుటుంబ సభ్యులను మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గురువారం సాయంత్రం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి. సుజాత తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే (ఇన్‌సెట్‌లో రాధాకృష్ణ)



నిర్మానుష్యంగా ఉన్న పట్టణం

బెంబేలెత్తిస్తున్న ఎండలు

పార్వతీపురం టౌన్ : ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండలు బెంబేలెత్తుస్తున్నాయి. పార్వతీపురంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి ఎండలు ఎక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతుండడంతో పనులపై బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రధాన రహదారి దుకాణాలు మూసివేసి వ్యాపారులు ఇళ్లకే పరిమితమ వుతున్నారు. మళ్లీ సాయంత్రం ఐదు గంటలు దాటాకే దుకాణాలు తెరుస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు ఇంత అధికంగా ఉంటే మే, జూన్ నెలల్లో ఇంకా ఎంత ఎక్కువగా ఉంటాయని ప్రజలు భయపడుతున్నారు.

తలసేమియా బాధితునికి పింఛను

మక్కువ : మండలంలోని కన్నంపేటకు చెందిన ఎం.అక్షయ్‌కుమార్‌కు రూ.10వేలు పింఛను మంజూరైంది. అక్షయ్‌కుమార్ తలసీమియా వ్యాధితో బాధపడుతున్నట్టు అతని తండ్రి మిరియాలు జైకుమార్ నిరుపేద కావడంతో కుమారుని వైద్యం కోసం ఎన్నో శ్రమలు పడుతూ వస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం తల సేమియా వ్యాధిగ్రస్తులకు కూడా పెన్షన్ పథకం గుర్తింపు చేసింది. గురువారం ఈ పెన్షన్ స్థానిక సర్పంచ్ బి.సావిత్రమ్మ అందజేశారు. మండలంలో మొట్టమొదటిగా ఈ పెన్షన్ మంజూరైంది.

మల్లమ్మపేటలో డెంగీ

బొబ్బిలి: స్థానిక మల్లమ్మపేటలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన షేక్ రఫీ గత వారం రోజులుగా జ్వరంతో బాధ పడడంతో రెండు రోజుల క్రితం బొబ్బిలిలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. రక్త పరీక్షలు చేసిన వైద్యులు విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ డెంగీ ఉన్నట్లు నిర్ధారించారు. రఫీకి డెంగీ నిర్ధారణ కావడంతో మల్లమ్మపేటలో వైద్య సిబ్బంది బి.బలరాంనాయుడు, పైడపునాయుడు, ఎఎన్‌ఎం లు, ఆశలు గురువారం ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. దోమలు నివారణకు కుండీలు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది మల్లమ్మపేటలో దోమలు నివారణకు ఫాగింగ్ చేశారు.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు': ఎమ్మెల్యే

గజపతినగరం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నియోజకవర్గంలోని పురిటిపెంట గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పదకాలను ప్రజలకు ఎంపిపి, జెడ్‌పిటిసి, పార్టీ కన్వీనర్ లు, వాలంటీర్లు, గృహసారదులు వివరిస్తారని అన్నారు. నియోజకవర్గం మొత్తం వైసిపి శ్రేణులు దీనిలో భాగస్వాములు కావాలని అన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ తీగ తగిలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మక్కువ మండలం చెముడుకు చెందిన కోట శంకర్రావు అనే ఎలక్ట్రీషన్ గురువారం తన గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అనుకోకుండా వైర్లలో విద్యుత్ ప్రవహించడంతో వైర్లు శరీరం మీద పడి గాయాలకు గురయ్యాడు. స్థానిక చికెన్ షాప్‌లో విద్యుత్ సరఫరా రాకపోవడంతో యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో వైర్లు పరిశీలిస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ ప్రవహించి గాయాల పాలయ్యాడు. స్పందించిన స్థానికులు మక్కువ పిహెచ్‌ఈకి తరలించగా మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన వ్యక్తి అరెస్టు


ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని చంద్రప్పవలసకు చెందిన యువతని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు రూరల్ సిఐ ధనుంజయనాయుడు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులకు మాట్లాడారు. చంద్రప్పవలసకు చెందిన బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఇళ్ల పైడ్రాజు మూడేళ్లుగా ఆమె ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తీరా ఆమె పెళ్లిచేసుకోమంటే కాదు పొమ్మంటున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పైడిరాజును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్ : డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలం లోని గుమ్మ గ్రామ సమీపంలో కోళ్ల వ్యాన్ చెట్టును ఢీకొని డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గురు వారం ఉదయం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబం ధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం కోళ్ల వ్యాను వస్తుండగా రోడ్డు పక్కన గల చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో వ్యాన్ డ్రైవరు ఎన్.అనిల్ (30), క్లీనర్ బి.రంజిత్ (20) తీవ్రం గాయపడ్డారు. వీరికి స్థానిక సిహెచ్‌సిలో ప్రాథమిక చేసి, అనంతరం కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వ్యాను